క్లుప్తంగా

పూలే ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా సురేష్

చిక్కడపల్లి: మహాత్మజ్యోతిరావుపూలే 197వ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్‌గా బీఆర్‌ఎస్‌వీ నాయకులు, వ్యాసకర్త మిద్దె సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఆయన కన్వీనర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం మిద్దె సురేష్ మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీలో స్థానం కల్పించిన సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిషోర్‌గౌడ్‌లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 11న ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే మహాత్మజ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముషీరాబాద్ కన్వీనర్‌గా లక్ష్మణ్‌రావు..

ముషీరాబాద్: మహాత్మ జ్యోతిరావుపూలే 197వ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా తెలంగాణ ఎంబీసీ, సంచార జాతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బర్రోతు లక్ష్మణరావు నియమితులయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11న జరిగే పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఆదర్శంగా నిలుస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని, మహమ్మూద్ అలీ, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం, బీసీ అధికార ప్రతినిధులు, రాష్ట్ర బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వంజరి సంఘం డివిజన్ అధ్యక్షుడిగా ఆంజనేయులు



సత్కరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: రాష్ట్ర వంజరి సంఘం అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా లవంగం ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయనను కుల సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యదర్శిగా డోరే గంగారాజు, కోశాధికారిగా బాలకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా వంజరి నాగరాజులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సతీష్, ధరమ్, మహేష్, శ్రీకాంత్, రంగు ఉదయ్ తదితరులున్నారు.

నరేంద్ర పోరాటం యువతకు ఆదర్శం



చిక్కడపల్లి: నరేంద్ర చేసిన పోరాటాలు యువతకు ఆదర్శమని బీజేపీ ఓబీసీ మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ ఎం.ఉమేష్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఆలె నరేంద్ర వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు శ్రీకాంత్, వీఎస్టీ రాజు, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు దోనేటి సత్యం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్, సంజయ్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



నల్లకుంట: శ్రీరామకోటి లేఖన దివ్యయజ్ఞం ఆధ్వర్యంలో నల్లకుంటలో సప్తమ వార్షికోత్సవ కల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సీతారాములకు 108 కలశాల పంచామృతం, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించి అనంతరం సీతారాములను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మార్పీఎస్ నాయకుడు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆటో యూనియన్ నాయకుడు మీసాల శంకర్ తన అనుచరులతో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబుయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దళితులు, కార్మికులు, పేదల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరానన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని రాంబాబుయాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కుమారస్వామి, వెంకటేష్, చంద్రకాంత్, యాదయ్య, మల్లయ్య, నర్సింగ్‌రావు, బాబురావు, గిరి, వెంకటేష్, నారాయణ, పరమేష్, క్రాంతి, శివ తదితరులు పాల్గొన్నారు.

‘కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాం’



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

- కార్యకర్తలు, ప్రజల అండతో పార్టీ బలమైన శక్తిగా ఉంది
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో గతంలో ఏ ఎమ్మెల్యే చేయలేనంత అభివృద్ధి పనులను పూర్తి చేశామని ఆ ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని పార్సిగుట్ట సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ప్రసాద్, మాజీ అధ్యక్షుడు అజయ్‌ముదిరాజ్‌లు సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.

- ముషీరాబాద్‌లోని ఆదర్శకాలనీలో గత 35 ఏళ్ల కచ్చానాలా సమస్యను ఆ ప్రాంతానికి 44 సార్లు వెళ్లి శాశ్వత పరిష్కారం చేశామన్నారు.
- నాగమయ్యకుంట, పద్మాకాలనీలో వరద నీటి సమస్యను పరిష్కరించేందుకు సుమారు కోట్లాది రూపాయలతో కొత్తగా నాలాల పునర్నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు.
- రోడ్లను ఆధునీకరించి ప్రజల రాకపోకలను సులభతరం చేశామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల బలం, ప్రజల అండతో బలమైనశక్తిగా మారిందని అభిప్రాయపడ్డారు.
- పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ బీఆర్‌ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. అంతకు ముందు పార్టీ జెండాను పార్సిగుట్ట చౌరస్తాలో ఆవిష్కరించారు.
- బ్యాండు మేళాలు, డీజే పాటలతో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. సమ్మేళనానికి ర్యాలీగా తరలివచ్చారు. బీఆర్‌ఎస్ యువజన నగర నాయకుడు ముఠా జైసింహ, గ్రేటర్ సీనియర్ నాయకుడు సోమన్, ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మానరేష్, రవీందర్, డివిజన్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, ధీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, ఎం.డీ.మోహిన్, రాజు, బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరావు, గోవింద్ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాన్ని రూ.26 వేలు చెల్లించాలని టీఏ, డీఏ వర్తింపజేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆరోగ్య మిత్రల ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్రలను స్కిల్ ఎంప్లాయిస్‌గా గుర్తించి అర్హతకు తగినట్లుగా వెంటనే క్యాడర్‌ను మార్పు చేయాలన్నారు. షఫిలింగ్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. పీహెచ్‌సీ ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీలోనే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర నాయకులు శ్రీధర్ తదితరులున్నారు.

నేటి నుంచి సైకాలజిస్ట్ హిప్నోకమలాకర్ సంస్మరణ కార్యక్రమాలు



పద్మాకమలాకర్, సభ్యురాలు స్వరూపరాణి

చిక్కడపల్లి: ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ వ్యవస్థాపకులు హిప్నో కమలాకర్ 57వ జయంతి, 2వ వర్ధంతి కార్యక్రమాలను సోమవారం నుంచి 16 వరకు దేశవ్యాప్తంగా జరుగుతాయని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మాకమలాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం అశోక్‌నగర్‌లో ఆమె మాట్లాడారు. సామాజిక సమానత్వం కోసం చైతన్యం తెచ్చే విధంగా ప్రోగ్రామ్స్ చేయడంతో పాటు 100 పుస్తకాలు రాసి సైకాలజీ రంగానికి ఊపిరి పోసిన గొప్ప సైకాలజిస్ట్ కమలాకర్ అని అన్నారు. 12 డిగ్రీల విద్యావంతుడు, మనస్తత్వం, వ్యక్తిత్వ వికాస నిపుణులు కమలాకర్ జయంతి, వర్ధంతిని ఆయన అభిమానులు, శిష్యులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు స్వరూపరాణి, క్యార్లిన్‌లు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం గైర్హాజరుపై కార్పొరేటర్ క్లారిటీ



గోల్నాక కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ తనకు రాజకీయ భిక్ష పెడితే దానిని అంబర్‌పేట ఎమ్మెల్యే తుడిచి వేసేందుకు ప్రయత్నిస్తుండటంతోనే తాను పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకాలేదని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంపై ఆదివారం ఆమె ఓ ప్రకటనలో క్లారిటీ ఇచ్చారు. ఎమ్మెల్యే తనపై కక్షసాధింపు చర్యలతోనే హాజరు కాలేదని వివరించారు. తాను కార్పొరేటర్‌గా ఎన్నికైనప్పటి నుంచే ఎమ్మెల్యే పరోక్షంగా అవమానించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ వెంట తిరిగిన కార్యకర్తలను బెదిరించి తిరగకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలపై తనకు చివరి నిమిషంలో సమాచారం ఇస్తున్నారన్నారు. తాను రాజకీయాలకు కొత్త, ఆడబిడ్డ అని చూడకుండా కనీస గౌరవం ఇవ్వడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో పార్టీ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



కాచిగూడ: హేల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు ట్రస్ట్ చైర్‌పర్సన్ కాకుమాను లూర్దు జ్యోతి ఆదివారం చీరలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదిన వేడుకలను హంగు ఆర్భాటాలతో కాకుండా పేదవారి కోసం ఉపయోగించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలంకి జగదీష్ కుమార్, ప్రవీణ్‌కుమార్, ఉషారాణి తదితరులున్నారు.

బీజేపీకి బీసీలు వెన్నెముక



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు

అంబర్‌పేట: బీజేపీ పార్టీకి బీసీలు వెన్నెముక అని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చిన రమేష్ ఆధ్వర్యంలో ‘పల్లె పల్లెకు ఓబీసీ- ఇంటింటికీ బీజేపీ’ కార్యక్రమం నిర్వహించి స్థానికులకు కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డితో కలిసి గౌతంరావు హాజరై మాట్లాడారు. బీజేపీ అనుబంధ విభాగాలను మరింత పటిష్టం చేసేందుకు పార్టీ ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. సమిష్టిగా కష్టపడి రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఓబీసీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు వినోద్ యాదవ్, నాయకులు ఆనంద్‌గౌడ్, వెంకటేష్, రవీందర్, అజయ్‌కుమార్, రంగంపల్లి రాజు, మిరియాల శ్రీనివాస్, టీ.వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ శిక్షణకు పేద విద్యార్థికి ఆర్థిక సాయం



కవాడిగూడ: చదువుకు పేదరికం అడ్డుగా ఉండకూడదని ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఆదివారం ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో సివిల్స్ ప్రిమిలియన్స్‌లో అర్హత సాధించిన వరంగల్ జిల్లాకు చెందిన ప్రణీత్‌కుమార్‌కు ఢిల్లీలో శిక్షణ కోసం కావాల్సిన రూ.1,00,000 ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యారంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ పొంపెందించుకోవాలని అప్పుడే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని సూచించారు. చదువుకు ప్రతి పేద విద్యార్థికి ఐవీఎఫ్ ఆర్థికంగా సాయం అందజేస్తుందని వివరించారు. ఐవీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ (న్యూఢిల్లీ) గంజి రాజమౌళి చేతుల మీదుగా సాయాన్ని అందజేశారు.

ప్రజలను చైతన్య పరిచిన విప్లవ యోధుడు కానూరి



మాట్లాడుతున్న రచయిత సతీష్‌చందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన గొప్ప విప్లవ యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు కానూరి వెంకటేశ్వర్‌రావు అని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సంస్కృతిక సమైఖ్య ఆధ్వర్యంలో ఆయన 8వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సతీష్‌చందర్ మాట్లాడుతూ.. అరుణోదయ వ్యవస్థాపకులుగా తన కలం ద్వారా ఎన్నో కథలు రాసి, పాటలను అల్లి ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. పీఓడబ్ల్యూఎస్ జాతీయ కన్వీనర్ పి.సంధ్య, అరుణోదయ సంస్కృతిక సమైఖ్య అధ్యక్షులు వేణు, సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మల, కానూరి కుమార్తె అరుణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధా, కె.గణేష్ తదితరులున్నారు.

ఇతరులకు సహాయపడటంలో అంతులేని ఆనందం



కవాడిగూడ: ఇతరులకు సహాయం చేయడంలో అంతులేని ఆనందం ఉంటుందని రామకృష్ణమఠం స్వామి శితికంఠానంద అన్నారు. ఆదివారం రామకృష్ణ మఠంలో వివేకానంద ఆరోగ్య కేంద్రాన్ని రోటరీ గ్లోబల్ ఛాంపియన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో డెంటల్ చైర్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. డబ్బు సంపాదన కంటే సంపాదించిన దానిలో కొంత సాయం చేయడం ఉత్తమమన్నారు. రోటరీ డిస్ట్రిక్ సెక్రటరీ డాక్టర్ ఎస్.వీ.రామ్‌ప్రసాద్, రోటరీ గ్లోబల్ చాంపియన్స్ అధ్యక్షుడు నర్సింహ మేథా కోటారు, కార్యదర్శి సామశాస్త్రి, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు ఈశ్వరి, హరినాథ్, కర్ణ, జై శ్రీనివాస్, మహేష్‌పాటిల్, వివేకానంద, ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ అనుపమ, డాక్టర్ వందన, వాలంటీర్లు ప్రేమ్‌కుమార్, నీతేశానంద తదితరులున్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



ముషీరాబాద్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రావులపాటి మోజెస్ అన్నారు. రాంనగర్ డివిజన్ దయారా మార్కెట్ ప్రాంతంలో ఆదివారం ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. మురుగు సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం కాలనీలు, బస్తీలలో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. పరకాల మనోజ్‌గౌడ్, మోయిజ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలి



నల్లకుంటలో నిరసన తెలుపుతున్న వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం

- వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో నిరసన
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు, అరెస్టు

నల్లకుంట: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్‌ఆర్‌టీపీ అంబర్‌పేట నియోజక వర్గం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు నిరసన చేపట్టారు. తెలంగాణ- స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వేకెన్సీస్ అండ్ ఎంప్లాయిస్ (టీ-ఎస్ఏవీఈ) పేరిట నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద ఆదివారం ప్లకార్డులను ప్రదర్శించారు.

- ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న నల్లకుంట పోలీసులు ఘటనా చేరుకుని దిష్టి బొమ్మ దహనాన్ని అడ్డుకుని వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌టీపీ నేతలు మాట్లాడుతూ.. అరెస్టులు, నిర్బంధాలతో వాస్తవాలను కప్పిపుచ్చలేరని మండిపడ్డారు. పేపర్ లీకేజీలో అసలు దోషులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విచారణను సిట్‌కు అప్పగించిందని ఆరోపించారు. వైఎస్‌ఆర్‌టీపీ అంబర్‌పేట నియోజకవర్గం నాయకులు సయ్యద్ నదీమ్, సుమీత్ కుమార్, మహ్మద్ షరీఫ్, వెంకటేష్, నవీన్, విఘ్నేష్, రఫీక్ తదితరులున్నారు.

సిట్టింగ్ జడ్జితో ..

చిక్కడపల్లి: ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్‌ఆర్‌టీపీ ముషీరాబాద్ నియోజవర్గ కో-ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ డిమాండ్ చేశారు. 8 ఏళ్లుగా మీనమేషాలు లెక్కించిన ప్రభుత్వం ఆదరాబాదరాగా నోటిఫికేషన్లు ఇచ్చిందని ఆరోపించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రవీణ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రయత్నించడంతో చిక్కడపల్లి పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- బిశ్వాస్ కమిటీ ప్రకారం వెంటనే 1.91 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయాలన్నారు.
- టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి పేపర్లు బయటకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులు నెలకు రూ.3016 నిరుద్యోగ భృతిని చెల్లించి ఉద్యోగాలు రాని నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలన్నారు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.
- విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించి పేద విద్యార్థులపై భారం పడకుండా చూడాలన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూళ్లలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు నర్సింగ్, మునిరామ్ నాయుడు, శ్రీధర్‌రెడ్డి, మధు, ఎండీ షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ సువార్త ర్యాలీ



ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం ఈస్టర్ సువార్త ర్యాలీ హెబ్రోను గోల్కొండ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్ పరిసర ప్రాంతాల్లో పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ఓల్డ్ అండ్ న్యూసిటీ చర్చెస్ కన్వీనర్ బ్రదర్ బి.ఆనంద్ పాల్గొన్నారు. సీనియర్ దైవజనులు జోసెఫ్ కురియన్ ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు. హెబ్రోను దైవ సేవకులు బ్రదర్ ఓదర్, బ్రదర్ వరుణ్, హెబ్రోను విశ్వాసులు, హరినగర్ సామ్యూల్, జాన్‌పాల్, ఏలియ, బూర సైమన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం..

చిక్కడపల్లి: క్రీస్తు మార్గం అనుసరణీయమని హెబ్రోను చర్చి దైవసేవకుల జోసెఫ్ కురియన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఈస్టర్ పర్వదినం సందర్భంగా గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పరిసర ప్రాంతాలలో ఈస్టర్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఓల్డ్ అండ్ న్యూసిటీ చర్చెస్ కన్వీనర్ బ్రదర్ బి.ఆనందం ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త ర్యాలీ నిర్వహించారు. దైవ సేవకులు బ్రదర్ ఆబెద్, బ్రదర్ వరుణ్, విశ్వాసులు సామ్యూల్, జాన్‌పాల్, ఏలియా, బూర సైమన్, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిన్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన రాములు కుమారుడు ఎన్.నరేష్ (32) తిమ్మాపూర్ - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఏ.సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ - యాకుత్‌పురా రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలిరంగు జీన్స్‌ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు అభినందన



ఆర్.వివేక్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, హౌజింగ్ బోర్డు అధికారి ఆర్.వివేక్‌కు దళిత రత్న అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వివేక్ దంపతులను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. వారు మరిన్ని సేవలు సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, ప్రవీణ్, సత్యనారాయణ తదితరులున్నారు.

అనారోగ్యంతో యాచకుడు మృతి

చిక్కడపల్లి: అనారోగ్యంతో ఓ యాచకుడు మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్ ప్రాంతంలో రోడ్డుపై అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అతడు అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది నిర్ధారించారు. పోలీసుల విచారణలో మృతుడు ఎల్లప్పగా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడారం అర్చకుల ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్: మేడారం సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు ఆదివారం సికింద్రాబాద్ నగరంలో అమ్మవారి పూజలు నిర్వహించారు. బౌద్ధనగర్‌లో మేడారం దేవాలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు సంజీవ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ముఖ్య అతిథులుగా సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రధాన అర్చకులు కాకా సారయ్య, సందరి గోపాల్ హాజరయ్యారు. వీరిరువురి నేతృత్వంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో సమంత, విజయ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో బిహార్ వాసి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన దేవాసింగ్ (57) అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం తన కుమారుడితో రైలులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉండగా అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.